GV MALL
shop & celebrate
TELANGANA | ANDHRAPRADESH | KARNATAKA

ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్
Evening 6PM

సంపుటి (Volume): 1 ✦ సంచిక (Issue): 120 ✦ Published From: నంద్యాల (Nandyal) ✦ పేజీలు 3 ✦https:www.prajarepublic.com ✦ వెల - 1/- | గురువారం 05 డిసెంబర్ 2024

RNI No: APTEL/2023/87888 | Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole

## అమరావతి నిర్మాణానికి మంత్రాలయం పీఠాధిపతి రూ.50లక్షల విరాళం

సీఎం చంద్రబాబును ఉండవల్లిలోని నివాసంలో మంత్రాలయం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు మర్యాదపూర్వకంగా కలిశారు.

మంత్రాలయం, డిసెంబర్ 05, (రిపబ్లిక్ న్యూస్): సీఎం చంద్రబాబును ఉండవల్లిలోని నివాసంలో మంత్రాలయం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు మర్యాదపూర్వకంగా కలిశారు. పీఠాధిపతితో పాటు మఠం సభ్యులు ఆయన్ను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా సుబుదేంద్ర తీర్థులు మంత్రాలయం తరపున అమరావతి రాజధాని నిర్మాణానికి రూ.50 లక్షలు విరాళంగా అందజేశారు. ఇందుకు గాను సీఎం వారికి కృతజ్ఞతలు తెలిపారు. మరోవైపు మంత్రి లోకేశ్‌ను పీఠాధిపతి కలిసి ఆశీర్వదించారు.



## బంగ్లాదేశ్ జైళ్ల నుంచి 700 మంది ఉగ్రవాదులు, హంతకులుపరార్

బంగ్లాదేశ్‌లో విద్యార్థి ఉద్యమం సందర్భంగా జైళ్ల నుంచి పరారైన వందల మంది ఉగ్రవాదులు, నేరగాళ్ల ఆచూకీ తెలియడం లేదని అధికారులు చెబుతున్నారు.



డిసెంబర్ 05, (రిపబ్లిక్ న్యూస్): బంగ్లాదేశ్ విద్యార్థి ఉద్యమం సమయంలో జైళ్లను బద్దలు కొట్టడంతో పెద్ద సంఖ్యలో కరుడుగట్టిన ఉగ్రవాదులు, ఉరిశిక్ష పడిన హంతకులు పరారయ్యారు. వారిలో 700 మంది ఆచూకీ ఇప్పటికీ తెలియలేదు. ఈవిషయాన్ని ఆ దేశ అధికారులే బుధవారం వెల్లడించారు. నాటి ప్రధాని షేక్ హసీనాపై తిరుగుబాటు సందర్భంగా జరిగిన ఆందోళనల్లో దేశవ్యాప్తంగా 2,200 మంది ఖైదీలు తప్పించుకొన్నారు.ఈ విషయాన్ని జైళ్ల శాఖ చీఫ్ సయిద్ మహమ్మద్ మోతెర్ హొసైన్ ధ్రువీకరించారు. వీరిలో దాదాపు 1500 మందిని భద్రతా దళాలు తిరిగి అదుపులోకి తీసుకొన్నాయని పేర్కొన్నారు. పరారీలో ఉన్న 700 మంది ఖైదీల్లో 70 మంది వరకు కరుడుగట్టిన ఉగ్రవాదులు, ఉరిశిక్ష పడిన ఖైదీలు ఉన్నట్లు వెల్లడించారు. జులై 19న అల్లర్ల సందర్భంగా ఢాకా నగరానికి తూర్పున ఉన్న నార్సింగిలోని జైలుపై వందల మంది దాడి చేసి నిప్పుపెట్టారు. అనంతరం పెద్దసంఖ్యలో ఖైదీలను విడిపించారు.ఆ తర్వాత వారాల్లో మరో నాలుగు జైళ్లపై కూడా దాడులు జరిగాయి. వీటిల్లో కరుడుగట్టిన నేరస్థులను ఉంచే కషిమ-పూర్ జైలు కూడా ఉంది. పోలీసుశాఖ ప్రతినిధి ఇమామ్ హొసైన్ సాగర్ మాట్లాడుతూ పరారీలో ఉన్న ఖైదీల కోసం తీవ్రంగా గాలిస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే వీరి సమాచారం దేశంలోని అన్ని పోలీస్ స్టేషన్లకు పంపామన్నారు. ప్రధాని హసీనా దేశం వీడిన తర్వాత బెయిలు పొందిన ఉగ్రవాదులపై కూడా తమ నిఘా ఉందని చెప్పారు.

## కాకినాడ సెజ్, పోర్టు ఆక్రమణ కేసులో జగన్ను ఏ1గా చేర్చాలి :ఆనం వెంకటరమణారెడ్డి

కాకికాడ సెజ్, పోర్టు ఆక్రమణ కేసు ఎఫ్ఐఆర్లో వైకాపా అధ్యక్షుడు జగన న్ను ఏ1గా చేర్చాలని తెదేపా నేత, రాష్ట్ర ఆక్వా కల్చర్ అథారిటీ ఛైర్మన్ ఆనం వెంకటరమణారెడ్డి డిమాండ్ చేశారు.



అమరావతి,డిసెంబర్ 05, (రిపబ్లిక్ న్యూస్): కాకికాడ సెజ్, పోర్టు ఆక్రమణ కేసు ఎఫ్ఐఆర్ వైకాపా అధ్యక్షుడు జగన్ను ఏ1గా చేర్చాలని తెదేపా నేత, రాష్ట్ర ఆక్వా కల్చర్ అథారిటీ ఛైర్మన్ ఆనం వెంకటరమణారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఐడీని ఆయన కోరారు. తెదేపా కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆనం మాట్లాడారు. 8,320 ఎకరాల కాకినాడ సెజ్ను వైకాపా నేతలు దోపిడీ చేశారన్నారు. వాటాదారుగా ఉన్న కేవీ రావును అన్నివిధాలా బెదిరించి 4వేల ఎకరాల భూమిని అప్పనంగా కొట్టేశారని ఆరోపించారు. దేశంలో ఎక్కడా ఎకరా రూ.29వేలకు దొరకని భూమి జగన్ వర్గీయులకు కాకినాడ సెజ్లో ఎలా దొరుకుతుందని నిలదీశారు. ప్రముఖ కన్సల్టెంట్ రోహిత్ చతుర్వేది ఇచ్చిన నివేదిక ప్రకారం అక్కడ ఎకరా రేటు రూ.50లక్షల పైచిలుకు ఉందన్నారు.రూ.2వేల కోట్ల రూపాయల విలువైన కేవీరావు వాటా భూమిని రూ.12కోట్లు ఇస్తామని చెప్పి కొట్టేశారన్నది సుస్పష్టమని చెప్పారు. చెక్ రూపంలో ఇచ్చిన రూ.12కోట్లు కూడా 6 నెలల తర్వాత బ్యాంకులో జమ చేసుకోమనటాన్ని దోపిడీ అనాలా? దొంగతనం అనాలా? అని నిలదీశారు. చెక్ రూపంలో ఇచ్చిన రూ.12 కోట్లు 6 నెలల తర్వాత జమ కావటం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. జగన్ ప్రమేయం లేకుండా ఇది జరగని పని అని ఆరోపించారు. కాకినాడ పోర్టు కైవసం కోసం భారీ మోసానికి పాల్పడ్డారన్నారు.

## ప్రభుత్వ తప్పులపై ప్రశ్నిస్తే కేసులు

### .. హామీలపై నిలదీస్తే అరెస్టులు: కేటీఆర్

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ తప్పులపై ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు.



హైదరాబాద్, డిసెంబర్ 05, (రిపబ్లిక్ న్యూస్): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ తప్పులపై ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారని భారాసకార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. ఈమే-రకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టుచేశారు. "కాంగ్రెస్ పార్టీ హామీలపై నిలదీస్తే అరెస్టులు చేస్తున్నారు. పాలనలో లోపాలను గుర్తు చేసినా, గురుకులాల్లో విద్యార్థుల అవస్థలను పరిశీలించినా.. ప్రభుత్వం లాక్కుంటున్న భూములపై ఎదిరించినా కేసులు పెడుతున్నారు. కూల్చుతున్న ఇళ్లకు అడొచ్చినా.. వ్యవస్థలను దుర్వినియోగం చేస్తున్నారని ఫిర్యాదు చేసినా కేసులు నమోదు చేస్తున్నారు.సూట్కేసులు మీకు అరెస్టులు మాకు. మాజీ మంత్రులు, మా నాయకులు హరీశ్ రావు , జగదీశ్ రెడ్డితో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకుల అరె-స్టు అప్రజాస్వామికం. తక్షణం వారిని విడుదల చేయాలి అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

## ఆత్మగౌరవంతో బతకాలనేది పేదల కల : సీఎం రేవంత్ రెడ్డి

ఇందిరమ్మ ఇళ్ల పథకం యాప్‌ను సీఎంరేవంత్ రెడ్డి ఆవిష్కరించారు.



హైదరాబాద్, డిసెంబర్ 05, (రిపబ్లిక్ న్యూస్): ఆత్మగౌరవంతో బతకాలనేది పేదల కల అని సీఎం రేవంత్రెడ్డి అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం యాప్ను సీఎం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. "రోటీ, కపడా, ఔర్ మకాన్ అనేది ఇందిరమ్మ నినాదం. ఇల్లు, వ్యసాయ భూమిని ప్రజలు ఆత్మగౌరవంగా భావిస్తారు. అందుకే ఇందిరాగాంధీ దశాబ్దాల క్రితమే ఇళ్లు, భూపంపిణీ పథకాలను ప్రారంభించారు. దేశంలో గుడి లేని ఊరు ఉండొచ్చు కానీ.. ఇందిరమ్మ కాలనీ లేని ఊరు లేదు.రూ.10 వేలతో ప్రారంభమైన ఇందిరమ్మ ఇళ్ల పథకం నేడు రూ.5 లక్షలకు చేరుకుంది. ఇంటి నిర్మాణానికి ప్రతి పేదవాడికి రూ.5 లక్షల ఆర్థిక సాయం చేస్తున్నాం. అర్హులైన వారికే ప్రభుత్వ ఇల్లు చెందాలనేది ఈ ప్రభుత్వ లక్ష్యం. గతంలో కేసీఆర్ రద్దు చేసిన గృహ నిర్మాణ శాఖను పునరుద్ధరించాం. తొలి దశలో 4.50 లక్షల ఇళ్ల నిర్మాణానికి పరిపాలన అనుమతులు ఇచ్చాం" అని రేవంత్రెడ్డి అన్నారు.ఇందిరమ్మ ఇళ్ల పథకం మొబైల్ యాప్ ద్వారా శుక్రవారం నుంచి లబ్దిదారుల నమోదు చేయనున్నారు. ప్రతి మండల కేంద్రంలో మోడల్ హౌస్ ఏర్పాటు చేయనున్నారు. మొదటి విడతలో నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు చేయనున్నారు. నాలుగున్నర లక్షల ఇళ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దివ్యాంగులు, ఒంటరి మహిళలు, ట్రాన్స్ జెండర్లకు తొలి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. గ్రామ-సభల్లో ఇందిరమ్మ కమిటీల ద్వారా అర్హుల ఎంపిక చేయనున్నారు.

## గాజా విషయంలో భారత్ వైఖరి అదే : పార్లమెంట్లో జైశంకర్ వివరణ

గాజా సమస్య పరిష్కారానికి ద్విదేశ సిద్ధాంతానికే తాము మద్దతునిస్తామని విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ పేర్కొన్నారు. పార్లమెంట్లో దీనిపై ఆయన నేడు స్పష్టత ఇచ్చారు.



డిసెంబర్ 05, (రిపబ్లిక్ న్యూస్): గాజా సమస్యకు 'ద్విదేశ పరిష్కారానికి భారత్ మద్దతు ఇస్తుందని విదేశాంగ మంత్రి జైశంకర్ స్పష్టంచేశారు. ఆయన పార్లమెంట్లో నేడు ప్రశ్నోత్తరాల సమయంలో మాట్లాడుతూ ఈవిషయాన్ని వెల్లడించారు. గాజాపై చేసే ఏ తీర్మానంలో అయినా ఉగ్రవాదం, హమాస్ బందీల అంశం ప్రస్తావించకపోతే.. అది వాస్తవిక పరిస్థితిని ప్రతిబింబించదు.. సమతౌల్యంగా ఉండదని చెప్పారు."భారత్ స్వయంగా ఉగ్రవాద బాధిత దేశం. అలాంటిది మనమే ఉగ్రవాదాన్ని విస్మరించడం, తక్కువగా చూపడం వంటివి మన ప్రయోజనాలకు విరుద్ధం. ఎటువంటి తీర్మానాన్ని అయినా.. అందులో వాడిన పదాలతో సహా పరిపక్వతతో భారత్ చూస్తుంది. ఉగ్రవాదాన్ని, ప్రజలను బంధించడాన్ని న్యూఢిల్లీ ఖండిస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో ఏ దేశానికి అయినా ప్రతిస్పందించే హక్కు ఉంటుందని నమ్ముతాము. అదే సమయంలో ఆయా దేశాలు సాధారణ పౌరుల ప్రాణాలను కూడా దృష్టిలో ఉంచుకోవాలి. మానవీయ చట్టాలకు, కాల్పుల విరమణకు, హింస ముగింపునకు భారత్ మద్దతు ఇస్తుంది" అని విదేశాంగ మంత్రి పేర్కొన్నారు.ఇక ఇజ్రాయెల్ లో రక్షణ సహకారంపై ఆయన మాట్లాడుతూ.. దీనికి సంబంధించిన నిర్ణయాలు జాతీయ భద్రతా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని తీసుకొంటామన్నారు. "జాతీయ భద్రతా ప్రయోజనాల విషయంలో ఇజ్రాయెల్ తో బలమైన బంధం ఉంది. మన భద్రత ప్రమాదంలో పడిన సందర్భాల్లో అండగా నిలిచిన దేశం అది. మనం జాతీయ భద్రతా ప్రయోజనాలను బట్టి ఓ నిర్ణయం తీసుకొంటాం" అని పేర్కొన్నారు.ఇజ్రాయెల్లో యు-ఎన్ఆర్ఎడబ్ల్యూ సంస్థను బ్యాన్ చేయడంపై భారత్ వైఖరిని టీఎంసీ నేత సాకేత్ గోపాల్ ప్రశ్నించారు. ఆ సమయంలో వెస్ట్బ్యాంక్లో అక్రమ సెటిల్మెంట్లపైనా విదేశాంగ మంత్రి స్పందించాలని కోరారు. దీనికి జైశంకర్ సమాధానమిస్తూ "యు-ఎన్ఆర్ఎడబ్ల్యూకు మద్దతు ఇవ్వడంతోపాటు సహకరించాలని భారత్ నిర్ణయించింది. దానికే కట్టుబడి ఉంటాము. తాజాగా ఆ సంస్థకు సాయం కూడా పంపించాము" అని పేర్కొన్నారు. ఆ సంస్థకు ఏటా ఐదు మిలియన్ డాలర్ల సాయం పంపిస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. పాలస్తీనా ప్రజలకు అవసరమైన సాయం భారత్ నుంచి అందుతోందన్నారు. 70 మెట్రిక్ టన్నుల సహాయ సామగ్రి, 16.5 మెట్రిక్ టన్నుల ఔషధాలను పంపించినట్లు చెప్పారు.

## మాజీ మంత్రి హరీశ్ రావును తెలంగాణ హైకోర్టులో ఊరట

మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్రావుకు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది.





హైదరాబాద్, డిసెంబర్ 05, (రిపబ్లిక్ న్యూస్): మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్రవుకు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. పంజాగుట్ట పోలీసు స్టేషన్లో నమోదైన కేసు విషయంలో ఆయన్ను అరెస్టు చేయవద్దని ఉన్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. పోలీసులు తదుపరి దర్యాప్తు చేపట్టవచ్చని పేర్కొంది. ఇందుకు హరీశ్రావు సహకరించాలని సూచించింది. ఆయనపై ఫిర్యాదు చేసిన చక్రధర్ గౌడ్కు నోటీసులు జారీ చేస్తూ విచారణను వాయిదా వేసింది.హైదరాబాద్పంజాగుట్ట పోలీసుస్టేషన్లో స్థిరాస్తి వ్యాపారి జి.చక్రధరౌడ్ రాజకీయ కక్షతో ఇచ్చిన ఫిర్యాదు మేరకు నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ హరీశ్రావు బుధవారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఫోన్ ట్యాపింగ్కు పాల్పడ్డారంటూ తనతోపాటు రాధాకిషన్రావు తదితరులపై చక్రధర్ గౌడ్ ఇచ్చిన ఫిర్యాదులోని అంశాలపై పోలీసులు ప్రాథమిక విచారణ జరపకుండానే కేసు నమోదు చేశారన్నారు. ఫిర్యాదులో తనకు వ్యతిరేకంగా ఏమీ లేదని, దాన్ని కట్టుకథతో దాఖలు చేశారన్నారు. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు అరెస్ట్ చేస్తే తన రాజకీయ జీవితంతోపాటు ప్రతిష్ఠ దెబ్బతింటాయన్నారు. ఫోన్ ట్యాపింగ్ అనేది ఎప్పుడో జరిగిన సంఘటన అని, ఇంతవరకు పోలీసులకు ఎందుకు ఫిర్యాదు చేయలేదన్నారు. ఆయన పిటిషన్పై గురువారం హైకోర్టు విచారణ చేపట్టింది.

## కేసీఆర్ ఫామ్ హౌస్ నుంచి బయటకు వచ్చి మాట్లాడాలి : మంత్రి కొండా సురేఖ

భారాస నేతలకు అధికారం పోయిన తర్వాత కార్యకర్తలు గుర్తొచ్చారని మంత్రి కొండా సురేఖ అన్నారు.

కోమటిరెడ్డి బ్రదర్స్ గురించి మాట్లాడే అర్హత వారికి లేదని చెప్పారు.



హైదరాబాద్, డిసెంబర్ 05, (రిపబ్లిక్ న్యూస్): భారాస నేతలకు అధికారం పోయిన తర్వాత కార్యకర్తలు గుర్తొచ్చారని మంత్రి కొండా సురేఖ అన్నారు. కోమటిరెడ్డి బ్రదర్స్ గురించి మాట్లాడే అర్హత వారికి లేదని చెప్పారు. తెలంగాణ కోసం కోమటిరెడ్డి వెంకట్రెడ్డి జీనామా చేశారన్నారు. హైదరాబాద్లో నిర్వహించిన మీడియా సమావేశంలో సురేఖ మాట్లాడారు."మంత్రి కోమటిరెడ్డి గురించి గంధపు చెక్కల వ్యాపారి ఒకరు అగౌరవంగా మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ కక్షపూరిత రాజకీయాలు చేయదు. హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్రెడ్డి మతిభ్రమించి మాట్లాడుతున్నారు. అసెంబ్లీకి రాని నాయకుడు ప్రతిపక్ష నేత ఎలా అవుతారు? కేసీఆర్ ఫామ్ హౌస్ నుంచి బయటకు వచ్చి మాట్లాడాలి. భారాస అధికారంలో ఉండగా రేవంత్రెడ్డిని గతంలో చిన్న డ్రోన్ కేసులో కక్షపూరితంగా అరెస్ట్ చేశారు" అని కొండా సురేఖ అన్నారు.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501 EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

# డాక్టర్ మధుసూదనరావుకు

## ప్రతిష్టాత్మక ఐఎంఏ జాతీయ జీవితకాల సాఫల్య పురస్కారం



ఐఎంఏ జాతీయ లైఫ్ టైం అచీవ్ మెంట్ అవార్డు కు ఎంపికైన డాక్టర్ చిత్తలూరి మధుసూదనరావు

నంద్యాల , డిసెంబర్ 5 (రిపబ్లిక్ న్యూస్): భారతీయ వైద్య సంఘం ప్రతిఏటా నిర్వహించే జాతీయ మహాసభల సందర్భంగా ఇచ్చే పురస్కారాలలో భాగంగా, దేశంలో ఒక వైద్యునికి అందించే ఐఎంఏ లైఫ్ టైం అచీవ్ మెంట్ అవార్డు (జీవితకాల సాఫల్య పురస్కారం) ఈ సంవత్సరం నంద్యాలకు చెందిన ప్రముఖ చెవి ముక్కు గొంతు శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ చిత్తలూరి మధుసూదనరావును అవార్డ్స్ కమిటీ ఎంపిక చేసిందని ఐఎంఏ జాతీయ అధ్యక్షులు డాక్టర్ అశోకన్, ప్రధాన కార్యదర్శి అనిల్ నాయక్ ఢిల్లీ కేంద్ర కార్యాలయం నుండి రాష్ట్ర ఐఎంఏ శాఖకు సందేశం పంపించారు.డాక్టర్ చిత్తలూరి మధుసూదనరావు గత మూడు దశాబ్దాలకు పైగా నంద్యాల ప్రాంతంలో చెవి ముక్కు గొంతు శస్త్ర చికిత్స నిపుణులుగా చేస్తున్న విశిష్ట సేవలను గుర్తిస్తూ, ప్రతి ఏటా గత 17 సంవత్సరాలుగా దేశంలోని యువ ఈ ఎన్ టీ వైద్యులకు ప్రత్యక్ష శస్త్ర చికిత్సల కార్యశాల నిర్వహించి శిక్షణ ఇస్తున్నారని అవార్డ్స్ కమిటీ ఎంపిక ప్రకటనలో తెలిపారు. అంతేకాకుండా ప్రతి ఏటా గత 30 సంవత్సరాలుగా ఉచిత చెవి ముక్కు గొంతు శస్త్ర చికిత్సలను నిర్వహిస్తున్నారని,అదే విధంగా సామాజిక, కళా సేవలు విస్తృతంగా చేస్తున్నారని ప్రశంసించారు. ఈ అవార్డు ను డిసెంబర్ 27,28 వ తేదిలలో హైదరాబాద్ లో నిర్వహించ నున్న 99 జాతీయ మహా సభలలో అందచేసి సత్కరిస్తారు.ఐఎంఏ ప్రతిఏటా జాతీయ మహాసభల సందర్భంగా నలుగురిని దేశవ్యాప్తంగా ఉన్న ఐఎంఏ వైద్యుల నుండి విశిష్ట పురస్కారాల కోసం ఎంపిక చేస్తారు. వాటిలో రెండు ప్రతిష్టాత్మక పురస్కారాలు లైఫ్ టైం అచీవ్మెంట్ అవార్డు డాక్టర్ మధుసూదనరావుకు, గతవారం ప్రకటించిన సామాజిక సేవలకు అందించే డాక్టర్ జ్యోతి ప్రసాద్ గంగూలి స్మారక పురస్కారం డాక్టర్ రవి కృష్ణ ఎంపిక కావడం, ఇద్దరు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నంద్యాలకు చెందిన వైద్యులు కావడం విశేషమని ఐఎంఏ రాష్ట్ర శాఖ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ నందకిషోర్, డాక్టర్ సుభాష్ చంద్రబోస్, ఐఎంఏ నంద్యాల వైద్యులు హర్షం వ్యక్తం చేశారు.

# రైలుకు ఎదురుగా బైక్‌పై దూసుకెళ్లిన వ్యక్తి .. గేట్కీపర్ సమయస్ఫూర్తితో దక్కిన ప్రాణాలు

ఓ వ్యక్తి తిరుపతి వెళ్తున్న రైలుకు ఎదురుగా ద్విచక్రవాహనంపై దూసుకెళ్లాడు.



నవీపేట, డిసెంబర్ 5 (రిపబ్లిక్ న్యూస్): ఓ వ్యక్తి తిరుపతి వెళ్తున్న రైలుకు ఎదురుగా ద్విచక్రవాహనంపై దూసుకెళ్లాడు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా నవీపేట మండలం దర్యపూర్ రైల్వేగేట్ వద్ద చోటు చేసుకుంది. గేట్ కీపర్ సమయస్ఫూర్తితో వ్యవహరించి నవీపేట స్టేషన్మాస్టర్కు సమాచారం అందించారు. ఆయన లోకో పైలట్కు విషయం చెప్పడంతో రైలు నిలిపివేశారు. దీంతో బైక్పై వెళ్తున్న వ్యక్తి ప్రాణం నిలబడింది. బైకున్ను నడిపిన వ్యక్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటనతో అరగంట పాటు రైలును అక్కడే నిలిపేశారు. ఆర్పీఎఫ్ పోలీసులు వాహనదారుడిని అదుపులోకి తీసుకున్నారు. విచారణ నిమిత్తం నిజామాబాద్ కార్యాలయానికి తరలించారు.

# యురేనియం తవ్వకాలు ఆపాలని సీఎంకు లేఖ

యురేనియం తవ్వకాలు ఆపాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ లేఖ రాసినట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నంద్యాల, డిసెంబర్ 5 (రిపబ్లిక్ న్యూస్): నంద్యాల జిల్లా ప్యాపిలి మండలంలో యురేనియం తవ్వకాలు ఆపాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ లేఖ రాసినట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యం, గ్రామాల రక్షణ, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలను దృష్టిలో ఉంచుకొని తవ్వకాలు నిలపాలని కోరినట్లు తెలిపారు. యురేనియం త్వకాలు నిలిపివేస్తున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటన చేయాలని లేఖ ద్వారా కోరినట్లు వెల్లడించారు.

# నిప్పులు చిమ్ముతూ నింగిలోకి దూసుకెళ్లిన పీఎస్ఎల్వీ-సీ59

శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి పీఎస్ఎల్వీ-సీ59 వాహక నౌక విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లింది.



శ్రీహరికోట, డిసెంబర్ 5 (రిపబ్లిక్ న్యూస్): శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి పీఎస్ఎల్వీ-సీ59 వాహక నౌక నింగిలోకి దూసుకెళ్లింది. సాంకేతిక లోపం కారణంగా నిన్న చేపట్టాల్సిన ప్రయోగం ఇవాళికి వాయిదా పడిన విషయం తెలిసిందే. గురువారం సాయంత్రం 4.04 గంటలకు వాహకనౌక నిప్పులు చిమ్ముతూ దూసుకెళ్లింది.ఐరోపా అంతరిక్ష సంస్థ (ఈఎస్ఏ)కు చెందిన ప్రోబా-3తో పాటు మరికొన్ని చిన్న ఉపగ్రహాలను పీఎస్ఎల్వీ-సీ59 రాకెట్ ద్వారా భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ప్రయోగించింది. ప్రోబా-3లో రెండు ఉపగ్రహాలు ఉంటాయి. వీటి బరువు 550 కిలోలు. సూర్యుడి బాహ్య వాతావరణమైన కరోనాపై పరిశోధనలు చేయడం ఈ ప్రాజెక్టు ఉద్దేశం. ఇందుకోసం అవి పరస్పరం సమన్వయంతో ఒక క్రమపద్ధతిలో భూకక్ష్యలో విహరిస్తాయి. ఈ తరహా ప్రయోగాన్ని చేపట్టడం ప్రపంచంలోనే ఇది మొదటిసారని ఈఎస్ఏ తెలిపింది.

# వైకాపా నేతలకు వ్యవసాయంపై చర్చించే ధైర్యం ఉందా? : అచ్చెన్నాయుడు

వ్యవసాయంతో పాటు అనుబంధ సంస్థలను వైకాపా ప్రభుత్వం నాశనం చేసిందని మంత్రి అచ్చెన్నాయుడు ఆరోపించారు.



అమరావతి, డిసెంబర్ 5 (రిపబ్లిక్ న్యూస్): వ్యవసాయంతో పాటు అనుబంధ సంస్థలను వైకాపా ప్రభుత్వం నాశనం చేసిందని మంత్రి అచ్చెన్నాయుడు ఆరోపించారు. వ్యవసాయ రంగాన్ని గాడిలో పెట్టేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. వ్యవసాయంపై చర్చకు వచ్చే ధైర్యం వైకాపా నేతలకు ఉందా? అని ప్రశ్నించారు. గతంలో ధాన్యం సేకరించి రైతులకు డబ్బులు ఇచ్చే పరిస్థితి లేదని.. ఇప్పుడు ప్రకృతి విపత్తులు, తుపానులకు దెబ్బతిన్న ధాన్యాన్ని సైతం కూటమి ప్రభుత్వం సేకరిస్తోందన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి భరోసా ఇచ్చారు.

# స్టెల్లా షిప్లో అణువణువూ తనిఖీ జరుగుతోంది : మంత్రి నాదెండ్ల



విశాఖ, డిసెంబర్ 5 (రిపబ్లిక్ న్యూస్): బియ్యం అక్రమ రవాణాపై ఇప్పటి వరకు 1,066 కేసులు నమోదు చేశామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఇప్పటివరకు కోటి ఇరవై టన్నుల బియ్యం అక్రమ రవాణా జరిగిందన్నారు. రైస్ మిల్లర్ల అసోసియేషన్.. ప్రభుత్వంతో కలిసి పనిచేయాని సూచించారు. విశాఖ కలెక్టరేట్లో ప్రాంతీయ పౌరసరఫరాల శాఖపై జరిగిన సమీక్షకు మంత్రి నాదెండ్ల మనోహర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు."ఉత్తరాంధ్రలో ధాన్యం కొనుగోలు చేస్తున్నాం. ఒక్క ఉత్తరాంధ్రలోనే 1.69 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొన్నాం. రైతుల ఖాతాల్లో 24 గంటల్లోనే నగదు జమ చేశాం. విశాఖ, కృష్ణపట్నం పోర్టుల కంటే రెండింతల బియ్యం కాకినాడ పోర్టు నుంచి తరలిపోయింది. కాకినాడ పోర్టు ద్వారా బియ్యం అక్రమ రవాణాలో కొందరు సీనియర్ అధికారుల పాత్ర ఉంది. విశాఖ పోర్టుపైనా దృష్టిపెట్టాలని అధికారులను ఆదేశించాం. కాకినాడు కలెక్టర్ ఆధ్వర్యంలో స్టెల్లా షిప్లో అణువణువూ తనిఖీ జరుగుతోంది. రేషన్ బియ్యం అక్రమ రవాణా పై సీబీ సీఐడీ విచారణకు ఆదేశించాం. ఇప్పటివరకు 729 మందిని, 102 వాహనాలను సీజ్ చేశాం. అక్రమార్కులపై పీడీ యాక్ట్ నమోదు చేస్తాం"అని నాదెండ్ల హెచ్చరించారు

# భారాస ఆందోళన.. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్తత

మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావును విడుదల చేయాలంటూ భారాస కార్యకర్తలు గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు.



హైదరాబాద్, డిసెంబర్ 5 (రిపబ్లిక్ న్యూస్): మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్ రావును విడుదల చేయాలంటూ భారాస కార్యకర్తలు గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఇంటి వద్ద గురువారం హరీశ్రావుతో పాటు కొందరు భారాస నేతలను అదుపులోకి తీసుకున్న పోలీసులు గచ్చిబౌలి పీఎస్ కు తరలించారు. పార్టీ శ్రేణులతో కలిసి గచ్చిబౌలి పీఎస్కు వచ్చిన ఎమ్మెల్సీ కవిత.. హరీశ్ రావును విడుదల చేయాలంటూ స్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. కార్యకర్తల ఆందోళనతో గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్తత నెలకొంది.

# సింధియాలో ట్యాంకర్ల సిబ్బంది సమ్మె

సింధియాలో హెచ్పీసీఎల్ బ్లాక్ ఆయిల్ టెర్మినల్ వద్ద ట్యాంకర్ల సిబ్బంది సమ్మె నిర్వహించారు.



విశాఖపట్నం, డిసెంబర్ 05 , (రిపబ్లిక్ న్యూస్): సింధియాలో హెచ్పీసీఎల్ బ్లాక్ ఆయిల్ టెర్మినల్ వద్ద ట్యాంకర్ల సిబ్బంది సమ్మె నిర్వహించారు. దీని వల్ల ఇంధన రవాణా నిలిచిపోయింది. వివరాల్లోకి వెళ్లగా.. బుధవారం రాత్రి స్థానిక ఏకేసి కాలనీకి చెందిన అయిదుగురు యువకులు ట్యాంకర్ల సిబ్బంది పై దాడి చేశారు. ఈ ఘటనలో డ్రైవర్ రఫీకి గాయాలు అయ్యాయి. దీంతో సమ్మెకు దిగిన ట్యాంకర్ల సిబ్బంది. రవాణా నిలిచిన నేపథ్యంలో పోలీసుల చర్యలు తీసుకున్నారు. ఈ దాడిలో పాల్గొన్న యువకులల్లో ఒకరు ఏ ఆర్ కానిస్టేబుల్ నరేంద్రను పోలీసులు అరెస్టు చేసి సస్పెండ్ చేశారు.

# ఏపీలో శాంతిభద్రతల సమస్య సృష్టించేందుకు జగన్ కుట్రలు:యనమల

ప్రజా సమస్యలపై ఆందోళనలకు జగన్ పిలుపునివ్వడం హాస్యాస్పదమని తెదేపా సీనియర్ నేత, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు.



అమరావతి, డిసెంబర్ 05 , (రిపబ్లిక్ న్యూస్): ప్రజా సమస్యలపై ఆందోళనలకు జగన్ పిలుపునివ్వడం హాస్యాస్పదమని తెదేపా సీనియర్ నేత, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు. గత ప్రభుత్వంలో చోటు చేసుకున్న తప్పిదాలను ప్రస్తుత ప్రభుత్వానికి ఆయన బదిలీ చేయాలనుకుంటున్నారని విమర్శించారు. ఖజానాను ఖాళీ చేసిన జగన్.. అధికారం లేకుండా ఉండలేక పోతున్నట్లుందని వ్యాఖ్యానించారు. అరాచక పాలనను కొద్ది నెలల క్రితమే ప్రజలు తిరస్కరించారని.. ఈ విషయాన్ని జగన్ గుర్తించాలని యనమల హితవు పలికారు.వైకాపా ప్రభుత్వంలో పడిన అష్టకష్టాలను ప్రజలు ఇంకా మర్చిపోలేదని యనమల అన్నారు. వైకాపా ఆందోళనలతో రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్య సృష్టించేందుకు జగన్ కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. గతంలో చెన్నారెడ్డి పాలనలో ఇలాగే చేసిన అనుభవం వైఎస్ఆర్ కుటుంబానికి ఉందని గుర్తుచేశారు. జగన్ కేసుల విచారణలో వేగం పెరిగితే ప్రజలకు సత్వర న్యాయం జరుగుతుందన్నారు. వైఎస్ హయాంలో సెజ్ పేరుతో చిన్న, మధ్య తరహా రైతుల భూములను తీసుకున్న కేవీరావు పైనా కేసు నమోదు చేయాలని యనమల అన్నారు.

# ఏపీలో కొనసాగుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్

ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్ కొనసాగుతోంది.



కాకినాడ, డిసెంబర్ 5 (రిపబ్లిక్ న్యూస్): ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్ కొనసాగుతోంది. కాకినాడ, డా. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, అల్లూరి సీతారామరాజు జిల్లాల పరిధిలో ఓటర్లుగా ఉన్న ఉపాధ్యాయులు, అధ్యాపకులు తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. ఆయా జిల్లాల్లోని మొత్తం 113 మండలాల్లో 116 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మండలానికి ఒకటి చొప్పున రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీరాజ్శాఖ భవనాల్లో కేంద్రాలు పెట్టారు. కాకినాడ, రాజమహేంద్రవరం, అల్లూరి సీతామరాజు జిల్లా వై. రామవరం మండలంలో అదనంగా మరొకటి ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పోలింగ్.. సాయంత్రం 4 గంటల వరకు కొనసాగనుంది.ఉప ఎన్నికలో ఐదుగురు అభ్యర్థులు పోటీలో ఉన్నారు. బ్యాలెట్ విధానంలో ఎన్నికలు జరుగుతున్నాయి. ఓటర్లుగా ఉన్న ఉపాధ్యాయులు, అధ్యాపకులు తమ ఓటును సంఖ్య రూపంలో వేయాలి. బ్యాలెట్ పత్రంలో అభ్యర్థి పేరుకు ఎదురుగా ఉన్న గడిలో సంఖ్య ఉంటుంది. ఓటరు తన ప్రాధాన్యతలో '1' సంఖ్య తప్పకుండా వేయాలి. లేదంటే అది చెల్లదు. పోటీలోని అభ్యర్థులందరికీ ప్రాధాన్యం ఇస్తూ ఓటేసే వెసులుబాటు ఉంది. అభ్యర్థులకు బ్యాలెట్ పేపరులో సంఖ్యలు కేటాయించారు. గంధం నారాయణరావుకు 1, దీపక్ పులుగుకు 2, డాక్టర్ నాగేశ్వరరావు కవలకు 3, నామన వెంకటలక్ష్మి(విళ్ల లక్ష్మి)కు 4, బొర్రా గోపీమూర్తికి 5వ సంఖ్యను కేటాయించారు. ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలో 92వ పోలింగ్ కేంద్రంలో అత్యధికంగా 896, అత్యల్పంగా అల్లూరి జిల్లా వై రామవరం మండలం డొంకరాయి ఏడో నెంబర్ పోలింగ్ కేంద్రంలో ముగ్గురు ఓటర్లు ఉన్నారు. ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు రిటర్నింగ్ అధికారిగా కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్మోహన్ వ్యవహరిస్తున్నారు.

# దిల్లీ వెళ్లే ప్రయాణికుడి వద్ద రెండు బుల్లెట్లు స్వాధీనం

విజయవాడ నుంచి దిల్లీ వెళ్లే ప్రయాణికుడి వద్ద నుంచి రెండు బుల్లెట్లు స్వాధీనం చేసుకున్నారు.

గన్నవరం, డిసెంబర్ 5 (రిపబ్లిక్ న్యూస్): విజయవాడ నుంచి దిల్లీ వెళ్లే ప్రయాణికుడి వద్ద నుంచి రెండు బుల్లెట్లు స్వాధీనంచేసుకున్నారు. వివరాల్లోకి వెళ్లగా.. హరియాణ రాష్ట్రం పానిపట్టుకు చెందిన ఆర్య అనే విద్యార్థి గుంటూరు జిల్లా ఓ ప్రైవేటు విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. దిల్లీ ఎయిర్ ఇండియా సర్వీసులో విమానంలో ప్రయణించేందుకు విమానాశ్రయం చేరుకున్నాడు. అక్కడ తనిఖీల్లో అతడి వద్ద రెండు(ఒకటి మిస్ ఫైర్, మరొకటి సాధారణ) బుల్లెట్ లు లభ్యం అయ్యాయి. విమానాశ్రయం పోలీసులు అదుపులోకి తీసుకుని, గన్నవరం స్టేషన్లో అప్పగించారు. విమానాశ్రయ అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

# స్మశానవాటిక ఆక్రమణలు తొలగించాలని గ్రామస్థుల ఆందోళన

విజయవాడ గ్రామీణం మంగళాపురం గ్రామంలో తమ గ్రామ స్మశాన వాటిక ఆక్రమణలు తొలగించాలని కోరుతూ గ్రామస్థులు ఆందోళన చేపట్టారు.



రామవరప్పాడు, డిసెంబర్ 04 , (రిపబ్లిక్ న్యూస్): విజయవాడ గ్రామీణం మంగళాపురం గ్రామంలో తమ గ్రామ స్మశాన వాటిక ఆక్రమణలు తొలగించాలని కోరుతూ గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. సుమారు 100 మంది పైగా గ్రామస్థులు స్మశాన వాటిక వద్దకు చేరుకొని ఆ ప్రాంతాన్ని పరిశీలించడానికి వచ్చిన గ్రామ పంచాయితీ కార్యదర్శిని అడ్డుకున్నారు. వెంటనే స్మశాన వాటిక ఆక్రమణలు తొలగించి వంద సంవత్సరాలకు పైగా ఉన్న ఈ ప్రాంతాన్ని అధికారులు తమ గ్రామ స్మశాన వాటికగా ప్రకటించాలని ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్పెషల్



# చరిత్రలో నేటి ప్రత్యేకత

- **1886** : భారతీయ సినిమా మొదటి మూకీ మరియు టాకీ దశకు చెందిన రచయిత, చిత్రదర్శకుడు, నటుడు, అర్దేషీర్ ఇరానీ జననం (మ.1969).
- **1896** : ఆంధ్రప్రదేశ్ కు చెందిన యోగీశ్వరుడు, అణు భౌతిక శాస్త్రవేత్త స్వామి జ్ఞానానంద జననం (మ.1969).
- **1901** : అమెరికన్ చలనచిత్ర నిర్మాత, దర్శకుడు వాల్ట్ డిస్నీ జననం (మ.1966).
- **1931** : తెలుగు నాటకరంగ నిపుణుడు, సినిమా నటుడు చాట్ల శ్రీరాములు జననం.(చిత్రంలో)
- **1940** : పాకిస్థాన్ కు చెందిన ప్రముఖ గజల్ గాయకుడు గులాం అలి జననం.
- **1972** : ఒంగోలు జిల్లా టంగుటూరి ప్రకాశం పంతులు జ్ఞాపకార్థం ప్రకాశం జిల్లా గా నామకరణము చేయబడినది.
- **2008** : ప్రముఖ తెలుగు సినిమా దర్శకుడు, నటుడు కొమ్మినేని శేషగిరిరావు మరణం (జ.1939).
- **2008** : ప్రముఖ సాహితీకారుడు మహ్మద్ ఇస్మాయిల్ మరణం (జ.1943).
- ప్రముఖ జర్నలిస్టు, ఎన్డీటీవి ఇండియా సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ రవీష్ కుమార్ జననం(1974) ప్రతిష్టాత్మక రామన్ మెగసెసే అవార్డుకు 2019 ఆయన ఎంపికయ్యారు.


అర్దేషీర్


వాల్ట్ డిస్నీ


చాట్ల శ్రీరాములు


గులాం అలి



రేణూ దేశాయ్


రేణూ దేశాయ్

# ఇన్ స్టాలో సమంత తాజా పోస్ట్ ఏంటంటే..

**సమంత తాజాగా పెట్టిన ఇన్‌స్టా స్టోరీలు వైరల్గా మారాయి. అభిమానులు వాటి గురించి చర్చించుకుంటున్నారు.**




సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్గా ఉండే సమంత తాజాగా పెట్టిన పోస్ట్ వైరల్ గా మారింది. సమంత బంధువు నిక్ డోస్ పెట్టిన పోస్ట్ను సామ్ షేర్ చేశారు.'ప్రపంచంలో మంచి వదినలు కూడా ఉంటారు. మా వదినను నేను ఎప్పటికీ ప్రేమిస్తుంటాను' అని నిక్ డోస్ పోస్ట్ పెట్టారు. దాన్ని షేర్ చేసిన సమంత లవ్ యూ అని పేర్కొన్నారు. తన ఇన్ స్టా స్టోరీలో 'సిటడెల్' టీమ్తో దిగిన ఫొటోను కూడా సమంత పంచుకున్నారు. ఇంత గొప్పటీమ్తో కలిసి నిచేయడం అద్భుతమైన అనుభూతి అని రాసుకొచ్చారు. 'సిటడెల్ : హనీ బన్నీ' కోసం రాజ్ అండ్ డీకేతో వర్క్ చేయడం నిజంగా గర్వంగా ఉందన్నారు ఎప్పుడూఎప్పుడూ ఇన్స్టాలో స్ఫూర్తిమంతమైన వీడియోలను సమంత పంచుకునే విషయం తెలిసిందే. తాజాగా అలాంటి వీడియోనే పంచుకున్నారు. అబ్బాయి, అమ్మాయి మధ్య జరిగే కుస్తీ పోటీ వీడియోను షేర్ చేశారు. దాని ప్రారంభంలో అబ్బాయి పూర్తి ఆత్మవిశ్వాసంతో మ్యాచ్లోకి వస్తాడు. కానీ, పోటీ ముగిసేకొద్దీ అతడు అమ్మాయి చేతిలో ఓడిపోతాడు. ఈ వీడియోకు సమంత 'ఈ అమ్మాయిలాగా పోరాడండి' అని క్యాప్షన్ పెట్టారు. ప్రస్తుతం సమంత ఇన్స్టా స్టోరీలు వైరల్ గా మారాయి. అభిమానులు వీటి గురించి చర్చించుకుంటున్నారు.సమంత ఇటీవల తన తండ్రిని కోల్పోయిన విషయం తెలిసిందే. చిన్నతనంలో తండ్రి అన్న మాటలు తన ఆత్మవిశ్వాసంపై ఎంతో ప్రభావం చూపించాయని ఆమెఎన్నో సందర్భాల్లో చెప్పారు. ఆయన మాటల వల్లే తాను ఆత్మస్థైర్యం పెంచుకున్నట్లు తెలిపారు. నటిగా రాణించిన తర్వాత తల్లిదండ్రులు తనను చూసి ఎంతో గర్వపడ్డారన్నారు. ఇక వరైఫ్ విషయానికొస్తే.. ప్రస్తుతం ఆమె నటించిన 'సిటడెల్: హనీ బన్నీ' అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది. దీనితో పాటు 'మా ఇంటి బంగారం'ను ప్రకటించారు. 'రక్తా బ్రహ్మాండ్' అనే వెబ్సిరీస్ కూడా ఆమె జాబితాలో ఉంది. స్ఫూర్తిమంతమైన వీడియోలను సమంత పంచుకునే విషయం తెలిసిందే. తాజాగా అలాంటి వీడియోనే పంచుకున్నారు. అబ్బాయి, అమ్మాయి మధ్య జరిగే కుస్తీ పోటీ వీడియోను షేర్ చేశారు. దాని ప్రారంభంలో అబ్బాయి పూర్తి ఆత్మవిశ్వాసంతో మ్యాచ్లోకి వస్తాడు. కానీ, పోటీ ముగిసేకొద్దీ అతడు అమ్మాయి చేతిలో ఓడిపోతాడు. ఈ వీడియోకు సమంత 'ఈ అమ్మాయిలాగా పోరాడండి' అని క్యాప్షన్ పెట్టారు. ప్రస-్తుతం సమంత ఇన్ స్టా స్టోరీలు వైరల్ గా మారాయి. అభిమానులు వీటి గురించి చర్చించుకుంటున్నారు.సమంత ఇటీవల తన తండ్రిని కోల్పోయిన విషయం తెలిసిందే. చిన్నతనంలో తండ్రి అన్న మాటలు తన ఆత్మవిశ్వాసంపై ఎంతో ప్రభావం చూపించాయని ఆమెఎన్నో సందర్భాల్లో చెప్పారు. ఆయన మాటల వల్లే తాను ఆత్మస్థైర్యం పెంచుకున్నట్లు తెలిపారు. నటిగా రాణించిన తర్వాత తల్లిదండ్రులు తనను చూసి ఎంతో గర్వపడ్డారన్నారు. ఇక వరైఫ్ విషయానికొస్తే.. ప్రస్తుతం ఆమె నటించిన 'సిటడెల్: హనీ బన్నీ' అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది. దీనితో పాటు 'మా ఇంటి బంగారం'ను ప్రకటించారు. 'రక్తా బ్రహ్మాండ్' అనే వెబ్సిరీస్ కూడా ఆమె జాబితాలో ఉంది.

# 'పుష్ప2' జాతర ఎపిసోడ్కు బన్నీ రియాక్షన్ .. అల్లు అయాన్ లెటర్ వైరల్

'పుష్ప2' జాతర ఎపిసోడ్లో బన్నీ నటనకు అభిమానులు సలాం చేస్తున్నారు.





అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసిన 'పుష్ప2' ప్రేక్షకుల ముందుకు వచ్చేసింది. అందులోని యాక్షన్ సన్నివేశాలు, డ్యాన్సు ప్రేక్షకుల్లో జోష్ నింపుతున్నాయి. ముఖ్యంగా జాతర ఎపిసోడ్ అద్భుతమంటూ సోషల్ మీడియా వేదికగా అభిమానులు ప్రశంసిస్తున్నారు. అందులో అల్లు అర్జున్ మరో స్థాయిలో నటించారంటూ పొగిడేస్తున్నారు. గంగమ్మతల్లి అవతారంలో ఐకాన్ స్టార్ తన నట విశ్వరూపంతో గూస్బంప్స్ తెప్పించారని చరిత్రలో నిలిచిపోతుందంటున్నారు.అల్లు అర్జున్ 'పుష్ప2' ప్రీమియర్ను హైదరాబాద్ సంధ్య థియేటర్లో ఫ్యాన్స్తో కలిసి చూశారు. జాతర ఎపిసోడ్కు ఆడియన్స్ బన్నీకి సలాం కొట్టగా అల్లు అర్జున్ విజయోత్సాహంతో ఆనందం వ్యక్తంచేశారు. ప్రస్తుతం దీనికి సంబంధించిన వీడియో వైరల్ గా మారింది.**అల్లు అర్జున్ తపస్సు చేశారు: త్రివిక్రమ్** పుష్ప2కు వస్తోన్న స్పందనపై దర్శకుడు త్రివిక్రమ్ పోస్ట్ పెట్టారు.' సినిమాలో ఫహద్ ఫాజిల్, రష్మికల నటనకు మంచి స్పందన వస్తోంది. దేవీశ్రీ ప్రసాద్ సంగీతం చాలా బాగుంది. అన్నిటికంటే ముఖ్యంగా అల్లు అర్జున్ మీరు సృష్టించిన అద్భుతం నుంచి ప్రేక్షకులు అంత తొందరగా బయటపడలేరు. ఒక్క మాటలో చెప్పాలంటే యాక్ట్ చేయలేదు. తపస్సు చేశారు. ఇది బ్లాక్ బస్టర్ సినిమా' అని పేర్కొన్నారు.**వైరలవుతోన్న అయాన్ లెటర్..**పుష్ప2 విడుదల నేపథ్యంలో అల్లు అర్జున్కు అల్లు అయాన్ లెటర్ రాశాడు . 'నాన్నా.. నిన్ను, నీ విజయాన్ని చూస్తుంటే ఎంతో గర్వంగా ఉంది. నిన్ను నంబర్1గా చూస్తుంటే చెప్పలేనంత సంతోషంగా ఉంది. ఈరోజు చాలా ప్రత్యేకం. ప్రపంచంలోనే గొప్ప నటుడి సినిమా రిలీజ్ అవుతోంది. నువ్వెప్పుడూ నా హీరోవే. నీకు ఉన్న ఎంతోమంది అభిమానుల్లో నేను మొదటివాడిని' అని రాసుకొచ్చాడు. దీన్ని షేర్ చేసిన అల్లు అర్జున్ ఇలాంటి ప్రేమను పొందడం తన అదృష్టమని పేర్కొన్నారు. ఇప్పటివరకు సాధించిన విజయాల్లో ఇది అతి పెద్దదని అన్నారు.

రిపబ్లిక్ సినిమా CINEMA

# ఓటీటీలోకి అలియాభట్, త్రిప్తి డిమ్రి కొత్త చిత్రాలు.. స్ట్రీమింగ్ ఎక్కడంటే..?

**బాలీవుడ్ నటీమణులు అలియాభట్ త్రిప్తి డిమ్రి నటించిన రెండు కొత్త చిత్రాలు ఓటీటీలో రిలీజ్ కానున్నాయి. ఈ విషయాన్ని తాజాగా నెటిక్స్ వెల్లడించింది.**



బాలీవుడ్ నటి అలియాభట్ సోదరి పాత్రలో నటించిన తాజా చిత్రం'జిగ్రా'. వేదాంగ్ రైనా కీలకపాత్ర పోషించాడు. వాసన్ బాలా దర్శకత్వం వహించిన ఈ యాక్షన్ థ్రిల్లర్ అక్టోబర్ 11న థియేటర్లలో విడుదలైంది. అలియా యాక్టింగ్కు ప్రశంసలు దక్కినప్పటికీ సినిమా మిశ్రమ స్పందనలకే పరిమితమైంది. ఇప్పుడీ చిత్రం నెటిక్స్ వేదికగా వినోదాన్ని అందించనుంది. డిసెంబర్ 6 నుంచి ఇది స్ట్రీమింగ్ కానుంది.జిగ్రా చిన్నప్పుడే తల్లిదండ్రులను కోల్పోతారు సత్యభామ ఆనంద్ అంకుర్ఆనంద్ (వేదాం రైనా). దీంతో దగ్గరి బంధువులు వాళ్లను చేరదీసి పెంచి పెద్ద చేస్తా-రు. బిజినెస్పని మీద మరో సోదరుడితో కలిసి అంకుర్ హన్షదావో దీవికి వెళ్తాడు. అక్కడ చేయని తప్పునకుమాదక ద్రవ్యాల కేసులో ఇరుక్కుంటాడు. తన సోదరుడిని కాపాడేందుకు జైలుకు వెళ్లేందుకుఒప్పుకొంటాడు. అయితే, డ్రగ్స్ వినియోగించినందుకు కోర్టు అంకుర్కు మరణదండన విధిస్తుంది.ఈ విషయం సత్యకు తెలియడంతో తన తమ్ముడిని కాపాడేందుకు హర్షదావోకు వెళ్తుంది. మరి అక్కడికి వెళ్లాక ఆమెకు ఎదురైన పరిస్థితులేంటి? తమ్ముడికి పడిన మరణశిక్షను తప్పించేందుకు ఏం చేసింది? అనే కథాంశంతో ఈ సినిమా తెరకెక్కింది.

ఆరోగ్యం

# బాడీలోని పేరుకుపోయిన కొలెస్ట్రాల్ని కరిగించే మ్యాజికల్ రెసిపీ.. బీపి, షుగర్ కూడా కంట్రోల్

కొలెస్ట్రాల్, షుగర్, బీపి ఇవి నేటి కాలంలో చాలా మంది ఫేస్ చేసే ప్రాబ్లమ్స్. జాబ్ టెన్షన్స్, స్టడీ టెన్షన్, టైమ్కి తినకపోవడం, నీరు తాగకపోవడం, వర్కౌట్ సరిగ్గా చేయకపోవడం ఇలాంటి కారణాల వల్లే ఈ సమస్యలొస్తాయి. వీటికి అనుబంధంగా మరికొన్ని సమస్యలు కూడా వస్తాయి.ముఖ్యంగా కొలెస్ట్రాల్ పెరిగితే అది అక్కడితో ఆగిపోకుండా ధమనుల్లో కొవ్వు నిల్వలని పెంచి గుండెపోటుకు దారి తీస్తుంది. అందుకే, కొలెస్ట్రాల్ని తగ్గించుకోవాలి. ఇందుకోసం మందులపై ఆధారపడకుండా.. మందులతో సమానంగా పనిచేసే ఫుడ్ తీసుకోవచ్చు. అలాంటి ఓ ఫుడ్ రెసిపీ గురించి, కావాల్సిన పదార్థాల గురించి తెలుసుకోండి.



## కావాల్సిన పదార్థాలు..

1. ఎర్రబియ్యం
2. మునగ ఆకులు
3. మెంతులు
4. పెసలు

## పెసలు..

పెసల్లో ఎన్నో అద్భుత గుణాలున్నాయి. ఇవి రక్తంలోకి ప్రవహించే గ్లూకోజ్ని కంట్రోల్ చేస్తాయి. దీని గ్లైసెమిక్ ఇండెక్స్ 38. అందుకే షుగర్ ఉన్నవారికి మంచి ఔషధంలా పనిచేసా-్తయి. బీపి తగ్గడానికి కూడా హెల్ప్ చేస్తాయి. ఇందులోని మెగ్నీషియం దానికి హెల్ప్ చేస్తుంది. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్స్ ఫ్రీ రాడికల్స్ని కంట్రోల్ చేస్తాయి.

## మునగ ఆకు..

మునగాకులోని గుణాలు అన్నీ ఇన్నీ కావు. దీనిని తీసుకోవడం వల్ల కొలెస్ట్రాల్, బీపి తగ్గుతుంది. మునగాకులో విటమిన్స్ ఎ, బి, సి, విటమిన్ ఇ, ఐరన్, జింక్ వంటి విటమిన్స్, ఖనిజాలు ఉన్నాయి. మొరింగ ఆకుల్లో ఇన్సులిన్ నిరోధకతని తగ్గించే బయోయాక్టివ్ సమ్మేళనాలు ఉంటాయి. అంతేకాకుండా ఈ ఆకులు కొలెస్ట్రాల్ని తగ్గేందుకు హెల్ప్ చేస్తాయి. ఇందులోని యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు ధమనుల్లో ఫలకం ఏర్పడకుండా హెల్ప్ చేస్తాయి.

## మెంతులు..

ఈ రెసిపీలో మెంతులని కూడా వేస్తాం. మెంతులని కలపడం వల్ల కొలెస్ట్రాల్, బీపి, షుగర్ వంట సమస్యలు తగ్గుతాయి. ముఖ్యంగా షుగర్ తగ్గడానికి హెల్ప్చేస్తాయి. శరీరంలో పేరుకుపోయిన కొలెస్ట్రాల్ని తగ్గించడంలో హెల్ప్ చేస్తాయి. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్స్ ప్యాంక్రియాస్ పనితీరుని సరి చేస్తాయి. ఇది ఇన్సులిన్ జీవక్రియని పెంచి, ఇన్సులిన్ నిరోధకతని తగ్గిస్తాయి. షుగర్ని తగ్గించి బరువు తగ్గించడంలో హెల్ప్ చేస్తాయి.











## ఎర్రబియ్యం..

ఎర్ర బియ్యంలో ఔషధ గుణాలు ఉన్నాయి. కాబట్టి, వీటిని మన డైట్లో చేర్చడం వల్ల అనేక సమస్యలకి ఔషధంగా వాడుకోవచ్చు. దీనికోసం బియ్యాన్ని నూకలా చేసి వాడొచ్చు. హెూల్ గ్రెయిన్స్ ఎన్ని లాభాలని అందిస్తాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. దీనిని తీసుకోవడం వల్ల త్వరగా జీర్ణమవుతుంది కూడా.



## ఏం చేయాలి..



ఈ రెసిపీ చేయడానికి ముందురోజు రాత్రి కప్పు ఎర్ర బియ్యం నూక, కప్పు మునగాకు, అరకప్పు పెసలు, ఓ స్పూన్ మెంతుల్ని విడివిడిగా నానబెట్టాలి. తర్వాతి రోజు 3 కప్పుల నీటిలో ఉప్పు వేసి మరిగించాలి.. తర్వాత ఒక దాని తర్వాత ఒకటి వేసి మెత్తగా ఉడికించాలి. గంజిలా అవుతుంది. దీనిని మీరు వారానికి రెండు సార్లు తాగాండి. దీంతో కొలెస్ట్రాల్, బీపి, షుగర్ కంట్రోల్ అవుతుంది. దీంతో పాటు చాలా లాభాలున్నాయి. కావాలంటే కొద్దిగా జీలకర్ర కలుపుకోవచ్చు.

గమనిక:ఆరోగ్య నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం. ఈ కథనం కేవలం మీ అవగాహన కోసమే. ఇవి పాటించడం వల్ల ఫలితాలు అనేవి వ్యక్తిగతం మాత్రమే. వీటిని పాటించే ముందు డైటీషియన్ని సంప్రదించడమే ఉత్తమ మార్గం. గమనించగలరు.




రిపబ్లిక్ స్పోర్ట్స్ SPORTS

# బాద్ షా – బిగ్ బి ని వెనక్కినెట్టిన కెప్టెన్ కూల్ .. 'బ్రాండ్'లో ధోనీ జోరు!

**భారత మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ తన బ్రాండ్ విలువ ఏమాత్రం తగ్గలేదని నిరూపించాడు. సినీ ప్రముఖులను వెనక్కి నెట్టి అగ్రస్థానంలో నిలిచాడు.**

మైదానంలో అతడు కనిపించేది కేవలం రెండు నెలలు. మిగతా కాలమంతా వ్యక్తిగత జీవితానికే కేటాయిస్తాడు. కానీ, బ్రాండ్ ఎండార్స్మెంట్స్ విషయంలో మాత్రం బాలీవుడ్ స్టార్లను వెనక్కి నెట్టేసి రికార్డు సొంతం చేసుకున్నాడు. ఏడాది పొడవునా సినిమాలు, టీవీ కార్యక్రమాలతో బిజీగా గడిపే వారికంటే తన 'బ్రాండ్' ఏమాత్రం తగ్గలేదని నిరూపించాడీ టీమిండియా మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ. క్రికెట్ అభిమానులు ముద్దుగా 'తలా' అని పిలుచుకునే ధోనీ 2024 సంవత్సరం తొలి అర్ధభాగంలో భారీ సంఖ్యలో యాడ్స్తో మెరిశాడు. ఐదేళ్ల కిందటే అంతర్జాతీయ క్రికెట్కు గుడ్బై చెప్పేసిన ధోనీ ప్రస్తుతం ఐపీఎల్లో మా-త్రమే ఆడుతున్న విషయం తెలిసిందే. టామ్ మీడియా రీసెర్చ్ ప్రకారం 42 బ్రాండ్లకు ప్రచారకర్తగా వ్యవహరించాడు.**అందులో ముఖ్యమైనని..**ఎంఎస్ ధోనీ వ్యాపారపరంగా లగ్జరీ కార్ల నుంచి అన్నిరకాల బ్రాండ్ల యాడ్స్లో నటించాడు. అదే సమయంలో ఓటు ఔచిత్యాన్ని తెలిపేలా ఎలక్షన్ కమిషన్తో కలిసి ఝార్ఖండ్లో పనిచేశాడు. ధోనీ బ్రాండ్లలో కొన్ని.. సిట్రాన్, డ్రోన్ స్టార్టప్ గరుడ ఎయిరోస్పేస్, ఫ్లిప్కార్ట్కు చెందిన క్లియర్ట్రిప్, పెప్సీ కో, ఈమోటోరాడ్, మాస్టర్ కార్డ్, గల్ఆయిల్, ఓరియంట్ ఎలక్ట్రిక్ ఉన్నాయి. వచ్చే ఏడాది ఐపీఎల్లో మరోసారి అభిమానులను అలరించేందుకు ధోనీ సిద్ధమవుతున్నాడు. దీంతో ఈ సంఖ్య మరింత పెరిగే అవభారత మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ తన బ్రాండ్ విలువ ఏమాత్రం తగ్గలేదని నిరూపించాడు. సినీ ప్రముఖులను వెనక్కి నెట్టి అగ్రస్థానంలో నిలిచాడు.కాశం లేకపోలేదని బిజినెస్ వర్గాలు పేర్కొన్నాయి.**బాలీవుడ్ స్టార్లనుమించి..**నటులపరంగా బాలీవుడ్ స్టార్లు అక్షయ్ కుమార్, షారుక్ ఖాన్, అమితాబ్ బచ్చన్ బ్రాండ్లకు ప్రచారం చేయడంలో ముందుంటారు. అక్షయ్ 22, షారుక్ 20, అమితాబ్ రోజుకు 16 గంటల చొప్పున స్క్రీన్ ప్రెజెన్స్ ఉంటుంది. వీరితో పోలిస్తే ధోనీ 14 గంటలు మాత్రమే. కానీ, బ్రాండ్ల విషయంలో అమితాబ్, షారుక్ను ధోనీ అధిగమించాడు. ధోనీ అత్యధికంగా 42 ఎంబార్స్మెంట్లతో అగ్రస్థానంలో ఉన్నాడు. ఆ తర్వాత బిగ్బి అమితాబ్ 41, షారుక్ ఖాన్ 34, అక్షయ్ కుమార్ 28, సౌరభ్ గంగూలీ 24, విరాట్ కోహ్లి 21, రణ్వీర్ సింగ్ 21 స్థానాల్లో నిలిచారు.

